క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు యశ్వంత్



భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ కేబీఎన్ కాలేజీలో ఇటీవల స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో చిట్టినగర్‌లోని శ్రీగౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి సక్కూరి యశ్వంత్ అండర్ 19 కేటగిరీలో నాలుగో స్థానం సంపాదించి రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు యశ్వంత్‌ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెలలో పార్వతీపురం (మన్యం) జిల్లాలో జరుగనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు యశ్వంత్ హాజరుకానున్నాడని తెలిపారు. యశ్వంత్‌కు చెస్‌లో శిక్షణ ఇచ్చిన కోచ్ అవ్వారు రామకృష్ణను స్కూల్ యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి తరం పిల్లలను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దాలి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): నేటి తరం పిల్లలను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దాలని వట్టికూటి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ శ్రీరాజ్ వట్టికూటి అన్నారు. పాతబస్తీలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసి విదేశాల్లో స్థిరపడిన శ్రీరాజ్ బుధవారం ఆ విద్యాసంస్థను సందర్శించారు. పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఆయన తాను చదివిన హైస్కూల్ అభివృద్ధికి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర యువత డిజిటల్ వ్యాపారంలో నైపుణ్యాలను సాధించి, భవిష్యత్ నాయకులుగా ఎదగాలనే లక్ష్యంతో ఈరోజు సెమినార్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, కాలిబో అకాడమీ ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రకారుడు సన్నాల మృతి తీరనిలోటు



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ పోర్ట్రెట్ (రూపచిత్రాలు) చిత్రకారుడు సన్నాల సత్యనారాయణ వరప్రసాద్ (75) మృతి చిత్ర కళారంగానికి తీరనిలోటని ప్రపంచ తెలుగు కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పీరాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సన్నాల ఈ నెల 14వ తేదీన అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. సన్నాల కుటుంబ సభ్యులు ఆయన మృత దేహాన్ని కృష్ణలంకలోని స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. సన్నాల భౌతిక కాయాన్ని ప్రపంచ తెలుగు కళాకారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు టీవీ, కోశాధికారి ఉస్మాన్ ఖాన్, కార్యదర్శి బాలయోగి, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, చిత్రకారులు రాము, రేడాన్ సత్యం, శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు.

డాక్టర్ రమేష్‌బాబుకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): నగరంలో మూడున్నర దశాబ్దాలకు పైగా గుండె వైద్య సేవలు అందిస్తున్న ఆస్టర్ రమేష్ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్‌బాబుకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ రీజినల్ కార్డియాలజీ హెల్త్ కేర్ లీడర్‌షిప్ అవార్డు దక్కింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును వాయిస్ ఆఫ్ హెల్త్‌కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన బీట్ 2025 నేషనల్ కార్డియో వాస్క్యులర్ సమ్మిట్‌లో ప్రదాన చేసింది. ఫోర్టిస్ ఎస్కార్ట్ హార్ట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ అశోక్ సేథ్ చేతుల మీదగా డాక్టర్ రమేష్‌బాబు ఈ అవార్డు అందుకున్నారు.

రఘుపతి వెంకయ్యకు ఘన నివాళి

విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆశీష్ స్టూడియోలో తెలుగు చలన చిత్ర పితామహుడు రఘుపతి వెంకయ్య జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో వెంకయ్య చలన చిత్రాలకు ఊపిరిపోశారని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. 1921లో భీష్మప్రతిజ్ఞతో తెలుగు సినిమా చరిత్ర ప్రారంభమైందన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ.. వెంకయ్య సినీ రంగసేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డ్‌ను 1980లో ప్రారంభించిందన్నారు. అనంతరం గాయనీగాయకులు వి.కామేశ్వరి, సీత, లక్ష్మణ్‌నాయక్‌ను ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, ప్రసూనారామన్, బి.వీరభద్రరావు, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు.

మురుగుతో సహవాసం

- డ్రైనేజీ అస్తవ్యస్తంతో ప్రజల ఇక్కట్లు
- 14 బ్లాకుల ఎదుట నిలిచిన మురుగు
- జ్వరాల బారిన పడుతున్న కాలనీ వాసులు



జక్కంపూడి కాలనీ బ్లాకులు



నాలుగు బ్లాకుల మధ్య పేరుకుపోయిన మురుగు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అసలే వర్షాకాలం ... ప్రతి రోజూ ఏదో సమయంలో వర్షం కురుస్తూనే ఉంది.. రోడ్డుపైకి చేరిన వర్షం నీరు ఎటూ వెళ్లే దారి లేదు.. దీనికి తోడు గత కొద్ది నెలలుగా అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థతో రోడ్లపై నిలిచిన వర్షం నీటిలోకి మురుగు నీరు వచ్చి చేరుతోంది. జక్కంపూడి కాలనీలోని బుడమేరు కాల్వ అవతల వైపు ఉన్న 34వ బ్లాక్ నుంచి 48వ బ్లాకుల వద్ద పరిస్థితి ఇదీ... కాలనీలో బ్లాకుల ఎదుట నిలిచిన మురుగు నీటి నుంచి భరించలేని దుర్వాసన వస్తున్నా కనీసం అధికారులెవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నెల రోజులుగా పరిస్థితి మరింత దారుణంగా తయారైందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పిల్లలను ఇంటి ముందు ఆడుకునేందుకు కూడా వదిలే పరిస్థితి కనిపించడం లేదని, పిల్లలు స్కూళ్ల నుంచి వచ్చిన తర్వాత బయటకు వచ్చే అవకాశం కూడా లేకుండా చేశారని వాపోతున్నారు. రోడ్లపై నిలిచిన మురుగుతో బ్లాకుల చుట్టూ నాచుపట్టి పోయిందని, నాచుతో ఇంటిలో నుంచి బయటకు వచ్చే వారు జారి పడి గాయాల పాలవుతున్నారని చెబుతున్నారు. వర్షం నీరు, మురుగు రోజుల తరబడి నిలిచిపోవడంతో రోడ్డు మొత్తం గోతులమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు.

జ్వరాల బారిన పడుతున్నాం...

14 బ్లాకులలో సుమారు నాలుగు వందల కుటుంబాలు నివాసం ఉంటున్నారని, ఈ మురుగు, వ్యర్థాలతో జ్వరాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాస్త ఎండలు ఉన్న తరుణంలో ఈ మురుగు నీటి నుంచి కాస్త ఉపశమనం ఉండేదని, గడిచిన వారం రోజులుగా రోజూ కురుస్తున్న వర్షంతో కంటి మీద కునుకు లేకుండా పోతోందంటున్నారు. మురుగు నీటి కారణంగా దోమలు ఎక్కువగా పెరుగుతున్నాయని, కనీసం దోమల మందు చల్లే వారు కూడా కనిపించడం లేదంటున్నారు.

కన్నెత్తి చూడని శానిటేషన్ సిబ్బంది

రోడ్లపై ఇంతగా మురుగు, వ్యర్థాలు పేరుకుపోయినా కనీసం శానిటేషన్ సిబ్బంది కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం, మురుగు నీరు పారేందుకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు ప్రాధేయపడినా వారు స్పందించడం లేదన్నారు. గతంలో రోడ్లపై మురుగు, డ్రైనేజీ నీరు వస్తే ట్యాంకర్లతో తోడే వారని, అయితే ఇప్పుడు ఎవరూ ఇటు వైపు రావడం లేదని వాపోతున్నారు. ఇక శానిటేషన్ సిబ్బంది బ్లీచింగ్, సున్నం చల్లి కొన్ని నెలలు అవుతోందని, ఏదైనా ప్రమాదం జరిగితే అప్పటికప్పుడు వచ్చి హడావుడి చేయడం తప్ప శాశ్వత పరిష్కారం చేసే ఆలోచన అధికారులకు లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుంటే పిల్లాపాపలతో కుటుంబ సభ్యులందరం కలిసి రోడ్లపై వచ్చి ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఉధృతంగా కోటి సంతకాల సేకరణ



38వ డివిజన్ కుమ్మరిపాలెం సెంటర్‌లో సంతకాలు చేస్తున్న ప్రజలు



39వ డివిజన్ కుమ్మరి బజార్‌లో సంతకం చేస్తున్న యువకుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేట్‌పరం చేసేందుకు యత్నించటాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఉధృతంగా సాగుతోంది. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన కోటి సంతకాల సేకరణకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రెహమతున్నీసా మాట్లాడుతూ పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలలను నిర్మించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వంలో ప్రారంభించారని, వాటిల్లో కొన్నింటిలో కార్యకలాపాలు ప్రారంభమై జరుగుతున్నాయని గుర్తు చేశారు. అసంపూర్తిగా ఉన్న కొన్ని మెడికల్ కాలేజీ భవనాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యగా వాటిని పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయటం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్ఈసీ సభ్యులు డీజేపీ కెనడి, జిల్లా అధికార ప్రతినిధి పాదిలి చంటిబాబు, మైనార్టీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, ఎస్కే నజీర్, షేక్ ఇర్ఫాన్, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, గోమతోటి వినోద్, మంటి రాము, బడుగు చిన్న తదితరులు పాల్గొన్నారు.

39వ డివిజన్‌లో డోర్ టు డోర్ సంతకాల సేకరణ

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు కుమ్మరి బజార్‌లో డోర్ టు డోర్ తిరిగి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైద్య కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద ప్రజలకు జరిగే నష్టాలను వివరించారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక ప్రభుత్వం మాత్రమే నిర్వహించాల్సిన సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ వాటి ఆస్తులను ఇతరులకు కట్టబెడుతున్నారని, తద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డీవీ రెడ్డి, అంబడిపూడి శ్రీకాంత్, గుడివాడ రామకృష్ణ, పాశం శ్రీనివాస్, కెప్టెన్ ప్రభాకర్, మణి, వెంకట్, ఫణి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ సేవలు అపూర్వం



అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెలంపల్లి తదితరులు

వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్‌కలామ్ దేశానికి అందించిన సేవలు అపూర్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలను ఆ పార్టీ జిల్లా మైనార్టీ విభాగ అధ్యక్షుడు షేక్ మస్తాన్, పశ్చిమ అధ్యక్షుడు ఎండీ అన్వర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు, ఇతర కార్పొరేటర్లు, నాయకులతో కలిసి కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. వెలంపల్లి మాట్లాడుతూ క్షిపణి శాస్త్రవేతగా, భారత రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్‌కలాం భారత దేశానికి అనేక సేవలందించారన్నారు. ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రపతి పదవికే వన్నె తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రెహమతున్నీసా, ఇర్ఫాన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ హయత్, మైనార్టీ నేతలు బాజీబాబా, షేక్ ఇర్ఫాన్, నాయకులు దాసి జయప్రకాష్ కెనడీ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళల ఆరోగ్యం సమాజానికి, దేశానికి ఎంతో అవసరమని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ శ్రీరమ్య కంటిపూడి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐసీసీ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన స్త్రీ - ఆరోగ్యకరమైన జీవనశైలి అంశంపై సదస్సును కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ శ్రీరమ్య మాట్లాడుతూ మహిళల్లో జీవనశైలి మార్పు కారణంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళలు తాము ఏ దశలో ఉన్నామో గ్రహించి ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే చాలా సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. మానసిక ఆరోగ్యం చాలా కీలకమని వివరించారు. కార్యక్రమాన్ని విభాగ కన్వీనర్ డాక్టర్ ఎ.రమాదేవి నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ ఎన్.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి సత్యబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యబాబు

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని ఎస్సీ హాస్టల్‌లో వసతులు జైలు కారాగారం కన్నా అధ్వానంగా ఉన్నాయని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు విమర్శించారు. సీపీఎం పశ్చిమ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో కొత్తపేటలోని మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఎం పశ్చిమ కమిటీ నేతృత్వంలో సౌమ్య థియేటర్ సమీపంలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించినప్పుడు హాస్టల్‌లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. హాస్టల్ ప్రాంగణం చెత్తాచెదారాలతో నిండి, మురుగు నీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి విద్యార్థులకు రాత్రుళ్లు నిద్ర కరవైందన్నారు. తాగునీటి సౌకర్యం సక్రమంగా లేదన్నారు. గదుల్లో ఖాళీలు లేక ఈ ఏడాది 30 మందికి పైన విద్యార్థులు వెళ్లిపోయినట్లు తెలిపారు. వందలాది మంది విద్యార్థులకు కేవలం నాలుగు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. హాస్టల్ మెనూ కార్డులో ఒక విద్యార్థికి ప్రతి రోజు కేవలం రూ.51.60 పైసలు మాత్రమే అందిస్తున్నారని, ఇది ఖైదీల ఆహారం కంటే ఘోరంగా విద్యార్థుల ఆహారానికి వెలకట్టడమేనని విమర్శించారు. హాస్టళ్లలో విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని, లైబ్రరీ రిక్రియేషన్ రూమ్ ఏర్పాటు చేయాలని, ట్యూటర్లని నియమించాలని, రెగ్యులర్‌గా మెడికల్ చెకప్‌లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం తరఫున ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.సూరిబాబు, నగర కమిటీ సభ్యులు జి.వెంకట్రావు, కరీముల్లా పాల్గొన్నారు.

ఆహార భద్రత, నాణ్యత ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

వీఎంసీ యూసీడీ పీఓ వెంకట నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట నారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఫుడ్ వెండింగ్ చేస్తున్న వీధి వ్యాపారస్తులు ఆహార భద్రత, నాణ్యత ధ్రువీకరణ పత్రం పొందటం తప్పనిసరని నగరపాలక సంస్థ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పిడుగు వెంకట నారాయణ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుడ్ వెండింగ్ చేస్తున్న సుమారు 500 మంది వీధి వ్యాపారస్తులకు ఆహార భద్రత, నాణ్యత అథారిటీ ఆఫ్ ఇండియా, సౌత్ రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని పీఎం స్వానిధి 2.0 ద్వారా బ్యాంక్ రుణాలు ఇస్తారని తెలిపారు. ఈ రుణాలు మొదటి విడతగా రూ.15వేలు, రెండవ విడతలో రూ.25వేలు, మూడవ విడతలో రూ.50 వేలు, క్రెడిట్ కార్డ్ ద్వారా రూ.30 వేలు అందిస్తారని వివరించారు. ఈ సందర్భంగా శిక్షణకు హాజరైనవారికి యాప్రాన్, మాస్కులు, టోపీలతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ డాక్టర్ ఆంజనేయులు చాగంటి, కె.సాయి శివ, టెక్నికల్ ఆఫీసర్, ఆహార భద్రత, నాణ్యత అథారిటీ ఎన్.రమేష్‌బాబు, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జీఎస్ లక్ష్మణరావు, ఎస్‌బీఐ డెప్యూటీ మేనేజర్ ఎస్.శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

27 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 27 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 27 మందిపై రెండు, నాలుగో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదుచేశారు. 27 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు 9 మందికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 18 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు.

డిగ్రీ అధ్యాపకులకు బదిలీలు నిర్వహించాలి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): డిగ్రీ కళాశాల్లో అధ్యాపకులుగా పని చేస్తున్న వారికి బదిలీలు నిర్వహించాలని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆయన బుధవారం లేఖ రాశారు. డిగ్రీ అధ్యాపకులు ఇతర ప్రభుత్వ శాఖలతో పాటుగా తమను బదిలీలు చేయాలని తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. అన్ని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల బదిలీలు చేపట్టారని.. కానీ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకుల బదిలీలు జరగలేదని పేర్కొన్నారు. బదిలీలకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కూటమి హామీలు మాటలకే పరిమితం



సంతకాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా మాటలకే పరిమితమైందని రాష్ట్ర ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం చిట్టినగర్ సెంటర్‌లో విజయవాడ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు బెవర శ్రీనివాసరావు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డ్‌ను పునఃరుద్ధరిస్తామని, కార్మికుల క్లెయిమ్‌లను పరిష్కరిస్తామని, భవన నిర్మాణ కార్మికుల సొమ్మును బ్యాంక్‌లో జమ చేస్తామని హామీ ఇచ్చి 16 నెలలైనా నేటికీ ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ అధ్యక్షులు కేఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఏరు దాటాక తెప్ప తగలేసిన చందాన కూటమి ప్రభుత్వం పని తీరు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెవర శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చీర్ల రామస్వామి, జగుపిళ్ల శ్రీను, పి.కోటేశ్వరరావు, రెడ్డి దుర్గారావు, సీహెచ్ రమణ, ప్రభుదాస్, కె.వెంకటేశ్వరరావు, డి.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీ రోడ్డులో రౌడీ షీటర్ వీరంగం

- మద్యం మత్తులో బీర్ సీసాతో యువకుడిపై దాడి
- అనంతరం తనను తాను పొడుచుకున్న వైనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేటీరోడ్డులో బుధవారం సాయంత్రం ఓ రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. నిత్యం జన సంచారంతో బిజీగా ఉండే కేటీ రోడ్డుపై రౌడీషీటర్ బీర్ సీసా పట్టుకుని ఒకరిపై దాడి చేయడమే కాకుండా తనను తాను పొడుచుకుని రక్తంతో హల్‌చల్ చేయడంతో జనం భయంతో పరుగులు తీశారు. సేకరించిన వివరాల ప్రకారం బెజ్జాల మేడ సమీపంలోని విజయ వైన్స్ వద్ద రౌడీషీటర్ నేమాల వెంకట నాగబాబు బీర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు వచ్చాడు. అదే సమయంలో వైన్స్ షాపు పక్కనే ఉన్న ఆటోలో కొంత మంది యువకులు మద్యం తాగుతూ వెంకట నాగబాబుకు కనిపించారు. బీరు బాటిల్ తీసుకుని బయటకు వచ్చే క్రమంలో ఆటోలోని యువకులు నాగబాబును ఏదో అన్నారు. దీంతో నాగబాబుకు ఆటోలో ఉన్న యువకుడితో వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో నాగబాబు తన చేతిలో ఉన్న బీర్ బాటిల్‌ను ఆ యువకుడి తలపై కొట్టి పగిలిన సీసాతో ఆ యువకుడి మెడపై పొడిచాడు. ఆ తర్వాత అదే సీసాతో తనకు తాను పొడుచుకోవడంతో రోడ్డుపై వెళుతున్న జనం భయంతో పరుగులు పెట్టారు. ఇంతలో సమాచారం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న వారిద్దరిని ఆసుపత్రికి తరలించారు. బీర్ సీసాతో పొడిచిన వెంకట నాగబాబు కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. నాగబాబుపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఓ హత్య కేసులో నాగబాబు నిందితుడని సమాచారం. అయితే ఈ ఘటనను పోలీసులు గోప్యంగా ఉంచడం విమర్శకు దారి తీసింది.

గాయని బాల సరస్వతికి శ్రద్ధాంజలి

విజయవాడ కల్చరల్: గాయని బాలసరస్వతి మృతి బాధాకరమని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ రావు బాలసరస్వతికి మహాకవి శ్రీశ్రీ పురస్కారం ప్రకటించిందని, అనారోగ్య కారణాలతో ఆమె ఆ పురస్కారం అందుకోలేకపోయారని గుర్తుచేశారు. తన మధుర స్వరంతో ఎన్నో పాటలకు జీవం పోసిన ఆమె మృతి తెలుగు చిత్రసీమకు తీరని లోటని సాహితీ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, డాక్టర్ గుమ్మాసాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పర్యాటక, ఆతిథ్య రంగాల అభివృద్ధి

ఏపీటీడీసీ డీవీఎం కృష్ణచైతన్య



సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య

భవానీపురం(విజయవాడ పశ్చిమ): జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా రాష్ట్ర పర్యాటక, ఆతిథ్య రంగాలలో అభివృద్ధికి మార్గం సుగమం అయ్యిందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విజయవాడ డివిజనల్ మేనేజర్ పరుచూరి కృష్ణచైతన్య తెలిపారు. భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో బుధవారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక శాఖకు చెందిన రిసార్ట్స్ గదుల అద్దెలు తగ్గడం వల్ల దేశీయ పర్యాటకం, వీకెండ్ ట్రిప్పులు పెరుగుతాయని తెలిపారు. ఏపీటీడీసీ వ్యాపార విస్తరణ, మౌలిక వసతుల కల్పన ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ శిల్ప, బెరంపార్క్ యూనిట్ మేనేజర్ కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత ఇదే కార్యక్రమాన్ని భవానీ ద్వీపంలో నిర్వహించగా మేనేజర్ డి.సుధీర్, అక్కడి సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గ గుడి ట్రస్ట్ బోర్డ్ మెంబర్ బుల్లబ్బాయికి సత్కారం



బుల్లబ్బాయిని సత్కరిస్తున్న ఎన్వీరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా నియమితులైన అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయి)కు బుధవారం అభినందన సత్కారం జరిగింది. బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎన్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, బీజేపీ నాయకులు బీఎస్ పట్నాయక్, ఏఎస్‌యూ మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ తాతాజీ, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు రాధాకృష్ణ, బీసీ నాయకులు వేముల వెంకట్రావు, వాల్మీకి బోయ సంఘ నాయకులు పి.నరసింహారావు, పి.గోపాలం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్వీ రావు మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలుగా భవానీలు, అయ్యప్ప స్వాములకు సేవలు అందిస్తున్న బుల్లబ్బాయికి అమ్మవారి గుడి ట్రస్ట్ బోర్డ్ సభ్యుడిగా అవకాశం లభించడం సముచితమన్నారు.